సాక్షి
జగిత్యాల
ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



జీవితం అంటే నిన్ను నువ్వు చూసుకోవటం కాదు, నిన్ను నువ్వు రూపుదిద్దుకోవటం.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
ఆది 6.33	సోమ 4.43

రంజాన్ వేళలు

హలీం.. రుచికి సలాం..!

- ఉమ్మడి జిల్లాలో ఘుమఘుమలాడుతున్న రంజాన్ రుచులు
- నోరూరిస్తున్న వివిధరకాల వంటకాలు

సాయంత్రం అయ్యిందంటే చాలు రోడ్లపక్కన రంజాన్ రుచులు నోరూరిస్తున్నాయి. పవిత్ర రంజాన్ మాసంలో ఓ వైపు ముస్లింలు ఉపవాస దీక్షలు చేస్తుండగా... మరోవైపు వివిధ రకాల వంటకాలు ఇఫ్తార్ సమయంలో ఆకర్షిస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పట్టణాల్లో ఏర్పాటు చేసిన రంజాన్ ప్రత్యేక స్టాళ్లలో చికెన్, మటన్ వంటకాలు ఆకట్టుకుంటున్నాయి. రంజాన్ మాసంలో లభించే అరుదైన వంటకం హలీం కోసం పోటీపడుతుండగా.. చిన్నాపెద్దా తేడా లేకుండా ఇష్టంగా ఆరగిస్తున్నారు. హలీంతో పాటు హరీస్.. ఇతర చికెన్, మటన్ పై వంటకాలు అందుబాటులో ఉంటున్నాయి. రంజాన్ రుచులు.. హలీం ప్రత్యేకతపై సండే స్పెషల్..!! – విద్యానగర్(కరీంనగర్) - 8లో ▸





న్యూస్‌రీల్

విద్యార్థులు భయం వీడాలి



హాల్‌టికెట్లు పంపిణీ చేస్తున్న రఘునందన్

జగిత్యాలరూరల్: పదో తరగతి విద్యార్థులు భయం వీడి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని తెలంగాణ సైకాలజీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూర్మాచలం రఘునందన్ సూచించారు. నర్సింగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు విజయ కంకణధారణ, పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. అనంతరం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. రఘునందన్ మాట్లాడుతూ, విద్యార్థులు పరీక్ష సమయంలో భయాందోళనకు గురికావద్దన్నారు. ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించవచ్చని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రావు, సర్పంచ్ సరోజన, ఎంపీటీసీ మహేశ్, సెక్టోరియల్ అధికారి రాజేశ్, ఏఎంసీ చైర్మన్ సు మలత, ఉపాధ్యాయులు స్వప్నప్రియ, శ్రీనివాస్, అరుణ, గంగ, మోహన్, విలాసిని, రవి కుమార్, శ్రీలత, రాజు, చందర్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జగిత్యాలజోన్: ఖైదీలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి కంచ ప్రసాద్ సూచించారు. స్థానిక స్పెషల్ సబ్ జైలులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శనివారం ఆరోగ్య పరీక్షలు, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి ప్రసాద్ మాట్లాడుతూ, మానసిక ఒత్తిడికి గురికాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గుండెపోటుకు గురైతే ఆస్పత్రికి వెళ్లేలోగా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జైలర్ మొగిలేశ్, హెడ్‌వార్డర్ మజారొద్దీన్, జిల్లా వైద్యాధికారి శ్రీధర్, వైద్యులు శ్రీనివాస్, సంతోష్, అజయ్‌కుమార్, ఖైదీలు పాల్గొన్నారు.

తమిళనాడుకు జగిత్యాల బియ్యం



వ్యాగన్‌లో లోడ్ చేస్తున్న బియ్యం

జగిత్యాలరూరల్: జిల్లాలోని పారాబాయిల్డ్ రైస్‌మిల్లుల నుంచి ఎఫ్‌సీఐ సేకరించిన బాయిల్డ్ రైస్‌ను శనివారం ప్రత్యేక రైలు ద్వారా తమిళనాడుకు తరలించారు. వివిధ మిల్లుల నుంచి 2,658 మెట్రిక్ టన్నుల బాయిల్డ్ బియ్యం సేకరించిన అధికారులు.. జిల్లాలోని లింగంపేట రైల్వేస్టేషన్‌కు తరలించారు. అక్కడ 42 వ్యాగన్లలో లోడ్ చేసి తమిళనాడు రాష్ట్రంలోని తిరునాన్‌వెల్లికి తరలించారు.

మామిడి కొనుగోళ్లు ప్రారంభం




జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల(చల్‌గల్) మామిడి మార్కెట్‌లో శనివారం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈఏడాది మార్కెట్లో కొత్తగా షెడ్లు నిర్మించారు. రోడ్ల వెంట దుకాణాలు అనుమతించడం లేదు. ఈ మేరకు, ఎంఎస్‌జే, జగిత్యాల మ్యాంగో సెంటర్ తొలి దుకాణాన్ని ఫ్రూట్ కమీషన్ ఏజెంట్ ఎండీ మోయిన్ షెడ్డులో ప్రారంభించారు. సోమవారం బంగినపల్లి రకం కిలో రూ.60 ధర పలికిందని తెలిపారు.

88,385 డాక్యుమెంట్లు.. రూ. 311.60 కోట్ల ఆదాయం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2022-23లో దండిగా రిజిస్ట్రేషన్లు

- గతేడాది కన్నా రూ.65.66 కోట్ల ఆదాయం అధికం
- కోర్టులో కేసుల పరిష్కారం అయినా నిషేధిత జాబితాలో ఆస్తులు
- సబ్ రిజిస్ట్రార్లకు పరిజ్ఞానం లేక మరిన్నింటికి బ్రేక్



2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు..	2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు..
డాక్యుమెంట్లు 83,650	డాక్యుమెంట్లు 88,385
వచ్చిన ఆదాయం రూ.245.94 కోట్లు	వచ్చిన ఆదాయం రూ.311.50 కోట్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రిజిస్ట్రేషన్ శాఖకు 2022–23 ఆర్థిక సంవత్సరం కాసుల పంట పండింది. ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు పెరగడంతో గతంలో కన్నా రూ.66 కోట్ల ఆదాయం ఎక్కువగా వచ్చింది. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 తేదీ వరకు పరిశీలించగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో 88,385 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.311.60 కోట్ల ఆదాయం సమకూరింది. గతేడాదితో పోల్చితే రూ.65.66 కోట్లు ఎక్కువగా వచ్చింది.

అడ్డంకిగా కోర్టు కేసులు

కోర్టు కేసుల్లో ఉన్న భూముల సమస్యలు పరిష్కారం అయినప్పటికీ వాటిని ప్రొహిబిటెడ్ లిస్ట్ నుంచి తొలగించడం లేదు. కోర్టు కేసుల్లో ఉన్న సర్వే నెంబర్లలో చాలా వరకు పరిష్కారం అయినట్లు ఆర్డర్లు వచ్చినా సంబంధిత వినియోగదారులు రిజిస్ట్రేషన్ శాఖకు సమాచారం ఇవ్వకపోవడంతో ఇంకా ప్రొహిబిటెడ్ లిస్ట్‌లోనే కొనసాగుతున్నాయి. దీంతో చాలా వరకు రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోతున్నాయి. కరీంనగర్ పరిధిలో చాలా కేసులు పెండింగ్‌లో ఉండడంతో రిజిస్ట్రేషన్‌లు కాలేదు. మరికొన్నింటిలో గుంటల్లో సమస్యలు ఉన్న సంబంధిత సర్వే నెంబర్‌లో కేసులు చూపించడంతో ప్రజలు భయపడుతున్నారు. కోర్టుల్లో పరిష్కారం అయిన ఆర్డర్ల సమాచారం పూర్తికాగానే రిజిస్ట్రేషన్ శాఖకు వస్తే మరిన్ని రిజిస్ట్రేషన్‌లు పెరిగే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇక గంగాధర సబ్‌రిజిస్ట్రార్ పరిధి కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలతోపాటు కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని రెండు ఏరియాల్లో ఏ ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు వెళ్లినా కోర్టు నుంచి ఆర్డర్ తప్పనిసరి అవుతోంది. రిజిస్ట్రేషన్ చేసుకునే వారు హైకోర్టును ఆశ్రయించి తీర్పుల కాపీలు చూపిస్తేనే రిజిస్ట్రేషన్‌లు అవుతున్నాయి.


చదువురాని సబ్‌రిజిస్ట్రార్లు...!

కోర్టు కేసులకు సంబంధించిన ఆర్డర్లు, ఏసీబీ, ఐటీ తోపాటు వివిధ సంస్థల నుంచి నిషేధిత జాబితాలో పెట్టాలని, లేదా వాటికి సంబంధించిన సమాచారం కావాలని రిజిస్ట్రేషన్ శాఖకు పంపితే.. ఆర్డర్ల అర్థాలు కూడా సబ్‌రిజిస్ట్రార్లకు తెలియడం లేదు. దీని కారణంగా వివిధ శాఖ నుంచి ఉత్తర్వులు రాగానే వాటిలో ఏముందో సరిగా అర్థం చేసుకోలేక నిషేధిత జాబితాతో పెడుతున్నారు. దీంతో వందల సంఖ్యలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేసులతో సంబంధం లేని ఆస్తులకు కూడా ప్రొహిబిటెడ్ లిస్ట్ వంక చూపుతూ సబ్‌రిజిస్ట్రార్లు అందినకాడికి దండుకొని రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఎస్ఆర్‌వో	డాక్యుమెంట్లు	వచ్చిన ఆదాయం(కోట్లలో)
గంగాధర	8,567	32.28
హుజూరాబాద్	4,926	16.39
జగిత్యాల	8,570	29.97
మల్యాల	2,342	4.94
మంథని	2,120	4.50
మెట్‌పల్లి	4,361	10.48
పెద్దపల్లి	10,401	49.21
సిరిసిల్ల	10,016	19.99
సుల్తానాబాద్	1,981	6.31
వేములవాడ	10,407	22.06
కరీనంగర్	13,818	79.72
కరీంనగర్‌రూరల్	6,198	21.89
కోరుట్ల	4,678	13.86

రవాణా శాఖ ఆదాయం రూ.303.39 కోట్లు

గతేదాదితో పోలిస్తే 54 శాతం వృద్ధి రేటు





చంద్రశేఖర్ గౌడ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా రవాణా శాఖ వార్షిక ఆదాయం రూ.303.39 కోట్లు సమకూరింది. ఉమ్మడి జిల్లా చరిత్రలో పన్నుల ద్వారా ఆదాయం తొలిసారిగా రూ.300 కోట్ల మార్కును దాటింది. గతేడాది వాహనాల కొనుగోళ్లు విపరీతంగా పెరిగాయి. దీంతో లైఫ్‌టాక్స్, క్వార్టర్లీ టాక్స్, సర్వీస్ టాక్స్‌లు అత్యధికంగా వసూలయ్యాయి. దీనికితోడు గతేడాది అధికారులు నిర్వహించిన తనిఖీల్లో జరిమానాల రూపంలో సైతం ఇబ్బడిముబ్బడిగా నిధులు రవాణా శాఖ ఖాతాల్లోకి వచ్చిచేరాయి. దీంతో ఆల్‌టైం రికార్డు సాధించినట్లయింది. క్వార్టర్లీ, లైఫ్‌టాక్స్‌లకు తోడు ఫీజుల ద్వారా రూ.40 కోట్ల 48 లక్షలు, సర్వీస్ చార్జీల ద్వారా రూ.9 కోట్ల 40 లక్షలు, తనిఖీల రూపంలో రూ.10 కోట్ల 25 లక్షల ఆదాయం వచ్చినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ వెల్లడించారు. జిల్లాల వారీగా చూస్తే.. కరీంనగర్ జిల్లాకు రూ.149 కోట్ల 40 లక్షలు, జగిత్యాల జిల్లాకు రూ.50 కోట్ల 96 లక్షలు, పెద్దపల్లి జిల్లాకు రూ.69 కోట్ల 97 లక్షలు, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.33 కోట్ల 6 లక్షల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. 2021–22 సంవత్సరంతో పోలిస్తే 2022–23లో 54 శాతం వృద్ధి రేటు సాధించామని స్పష్టం చేశారు.

నిర్బంధాలతో ప్రజలను అడ్డుకోలేరు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇంటి ఎదుట పోలీసు బందోబస్తు

జగిత్యాలటౌన్/జగిత్యాలక్రైం/సారంగాపూర్: ఉద్యమిస్తున్న ప్రజలను పోలీసు నిర్బంధాలతో అడ్డుకోలేరని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో పోలీస్ యాక్టు అమలుకు మంత్రి కొప్పుల ఈశ్వర్ కారణమని ధ్వజ మెత్తారు. జిల్లా కేంద్రంలో ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాశిగామతోపాటు పరిసర గ్రామాల్లో గాలి, నీరు కలుషితమై ప్రజల బతుకులు దుర్భరంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు పలు గ్రామాల ప్రజలు ఎదురు తిరుగుతున్నా ప్రభుత్వానికి అర్థం కావడం లేదన్నారు. కాగా, పాశిగ్రామ గ్రామస్తులను కలిసి వాస్తవాలు తెలుసుకునేందుకు బయలుదేరిన జీవన్‌రెడ్డిని పోలీసులు ఉదయం హౌస్ అరెస్టు చేశారు. కాగా బండారి నరేందర్ ఆకస్మిక మృతి తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు.

పదునైన కార్యకర్త నరేందర్

- నృత్యం చేస్తూ కుప్పకూలిన బీఆర్ఎస్ నేత
- గుండెపోటుతో నరేందర్ మృతి
- సంతాప సభగా మారిన ఆత్మీయ సమ్మేళనం
- సంతాపం వ్యక్తంచేసిన ఎమ్మెల్సీ కవిత
- శోకసంద్రమైన జిల్లా కేంద్రం



నరేందర్ ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీ



నరేందర్ భార్య రజనిని ఓదార్చుతున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



కంటతడి పెడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



సభకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

జగిత్యాల: బీఆర్ఎస్ సీనియర్ నేత బండారు నరేందర్ పదునైన కార్యకర్త అని, ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం జరగాల్సిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళానికి హాజరవుతున్న ఎమ్మెల్సీ కవితకు ఘనస్వాగతం పలికేందుకు చేపట్టిన ర్యాలీ, ప్రదర్శనలో నృత్యం చేస్తూ హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందిన బండారు నరేందర్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. ఆత్మీయ సమ్మేళనాన్ని సంతాపసభగా మార్చారు. ఈసందర్భంగా నరేందర్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. అనంతరం కవిత మాట్లాడుతూ, మనం ఒకటి తలిస్తే.. దైవం మరోటి తలుస్తుందని, ఈక్రమంలో నరేందర్ మృతి చెందడం బాధాకరమన్నారు. తెలంగాణ తల్లి సేవలో ఆయన నృత్యం చేస్తూ చనిపోయారని, ఆయన కుటుంబానికి అందరూ అండగా నిలవాలని కోరారు. 2013 నుంచి ఆయన తనకు పరిచయమని, రైతు నాయకుడిగా అనేక సేవలు చేశారని గుర్తుచేశారు. ఆయన భార్య బండారు రజనిని కవిత పరామర్శించారు.

ఆత్మీయ సమ్మేళనం ఇలా జరగాల్సి ఉంది..

స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనం జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఎమ్మెల్సీ కవిత వస్తున్నారు. ఆమెకు స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేశారు. ఉప్పరిపేట నుంచి కొత్తబస్టాండ్‌లోని తెలంగాణతల్లి విగ్రహం వరకు ర్యాలీగా తరలి వచ్చి తెలంగాణ తల్లికి పూలమాలలు వేయాల్సి ఉంది. ఆ తర్వాత సభకు వెళ్లాల్సి ఉంది. ఎమ్మెల్సీ కవిత ఉప్పరిపేటకు చేరుకోగా ఆమెకు స్వాగతం పలికేందుకు కొత్తబస్టాండ్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఒగ్గుకళాకారులు, కొన్ని లర్లు, 33వ వార్డు కౌన్సిలర్ రజని భర్త బండారి నరేందర్ నృత్యం చేస్తూ చేరారు. అక్కడ నరేందర్ అకస్మాత్తుగా కుప్పకూలారు. కొందరు సీపీఆర్ చేయగా స్పృహలోకి వచ్చారు. ఆ వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. దీంతో ఆత్మీయ సమ్మేళనాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రకటించారు.

భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు..

పద్మనాయక కల్యాణ మండపంలో చేపట్టిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి అన్నినియోజకవర్గాల నుంచి కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు పెద్దఎత్తున తరలివచ్చారు. నరేందర్ మృతితో కార్యక్రమం వాయిదాపడింది. దీంతో వారు నిరాశతో వెనుదిరిగారు.

గులాబీమయమైన జగిత్యాల..

నిజామాబాద్ రోడ్డు నుంచి తెలంగాణతల్లి విగ్రహం వరకు బీఆర్ఎస్ బ్యానర్లు, ఫ్లెక్సీలతో నిండిపోయింది. కొత్తబస్టాండ్ నుంచి పద్మనాయక కల్యాణ మండపం వరకు గులాబీమయంగా మారింది. కవితకు స్వాగతం పలికేందుకు నరేందర్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చూస్తూ పార్టీ శ్రేణులు కన్నీటిపర్యంతమయ్యారు. అందరితో కలివిడిగా ఉండే నరేందర్ ఇకలేరనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

గండిహన్మాన్ ఆలయంలో కవిత పూజలు

మెట్‌పల్లి(కోరుట్ల): జిల్లా పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ కవితకు జిల్లా సరిహద్దులోని గండి హన్మాన్ ఆలయం వద్ద మంత్రి ఈశ్వర్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో పాటు బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ర్యాలీగా జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు.

నరేందర్ కుటుంబానికి అండగా ఉంటాం

సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, నరేందర్ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారన్నారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోస ఇచ్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, నిత్యం ప్రజల్లో ఉండి అకస్మాత్తుగా చనిపోవడం బాధాకరమన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ, ఒక ఆత్మీయున్ని కోల్పోయామన్నారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ, టీఆర్ఎస్ జెండా కప్పుకుని ఆడబిడ్డకు స్వాగతం పలుకుతున్న నేపథ్యంలో కుప్పకూలిపోవడం బాధాకరమన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, తన కుడిభుజం కోల్పోయానన్నారు. ఆత్మీయుడిని కోల్పోయానని ఆయన కంటతడి పెట్టడం సభికుల గుండెలను బరువెక్కించింది. కార్యక్రమానికి తరలివచ్చిన కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘా సభ్యులు నరేందర్‌కు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, జెడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నృసింహునికి మొక్కులు



ఆలయంలో బారులు తీరిన భక్తులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఇంటిదారి పట్టారు.

రెండోవిడత గొర్రెల పంపిణీకి చర్యలు



హాజరైన కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: జిల్లాలో రెండోవిడత గొర్రెల పంపిణీకి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్రస్థాయి ఉన్నతాధిరులు జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 7.31లక్షల గొల్ల, కురుమలు, యాదవులను ఎంపికచేసి 50 శాతం గొర్రెలు పంపిణీ చేశామన్నారు. రెండో విడతలో 3.38 లక్షల యూనిట్ల పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ యాస్మిన్‌బాషా, అదనపు కలెక్టర్లు లత, మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

నగదు పద్ధతి పాటించాలి

మల్లాపూర్(కోరుట్ల): చేపపిల్లల పంపిణీ పథకంలో దళారుల ప్రమేయాన్ని నిర్మూలించడానికి నగదు బదిలీ పద్ధతి అవలంబించాలని పీసీసీ ఫిషర్మన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ కోరారు. ఢిల్లీలో ఏఐసీసీ నిర్వహించే ఫిషర్మన్ కాంగ్రెస్ జాతీయ సమావేశాలకు శనివారం మత్స్యకారులతో కలిసి ఆయన తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతుబంధు నగదును ఖాతాల్లో జమ చేస్తున్నట్లే చెపపిల్లల పంపిణీకి సంబంధించి నగదును మత్స్యకారులకు నగదు బదిలీ రూపంలో చెల్లించాలని ఆయన అన్నారు. ఆయన వెంట నాయకులు కల్లెడ గంగాధర్, పారపు రజనీకాంత్, సిరికొండ రవీందర్, న్యావనంది నడ్పినర్సయ్య, చిట్యాల రమేశ్, దేశవేణి నరేశ్ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న వీరలక్ష్మి

జగిత్యాలరూరల్: పిల్లలకు పౌష్టికాహారం అందించడంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సీడీపీవో వీరలక్ష్మి సూచించారు. శనివారం జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా స్వస్థ్ బాలక్ స్పర్ధ నిర్వహించారు. ఈసందర్భంగా మూడేళ్ల వయసులోపు బాలబాలికల్లో పెరుగుదల, బరువు, ఎత్తు పరిశీలించారు. వ్యక్తిగత పరిశ్రభతపై పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రక్తహీనత, ఐరన్, విటమిన్ సీ లోపం ఏర్పడకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు రాజేశ్వరి, శైలజరాణి, సూపర్‌వైజర్లు జానకి, స్వరూపరాణి, రాణి, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ మధు, బ్లాక్ కో ఆర్డినేటర్ శ్రీధర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

- 1956లో ప్రారంభమైన ప్రస్థానం
- తొలిదశలో పోస్టు కార్డులతో ప్రచారం
- నేడు గల్లీ నుంచి రెస్టారెంట్ల వరకు విక్రయాలు
- నగరంలో రంజాన్ రుచుల సందడి
- తినేందుకు జనం ఆసక్తి

హలీం.. రుచికి సలాం..!

సండే స్పెషల్

విద్యానగర్(కరీంనగర్): హలీం.. రంజాన్ మాసంలో లభించే అరుదైన వంటకం. ముస్లింల సంప్రదాయ వంటకంగా పేరొందినా.. కాలక్రమంలో అన్ని మతాలవారు ఇష్టంగా తినడంతో ప్రాచుర్యం పొందింది. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఇష్టపడే హలీంకు ఒకప్పుడు హైదరాబాద్ కేంద్రంగా ఉండేది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉమ్మడి కరీంనగర్‌లోని సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాకేంద్రాల్లోనూ హైదరాబాద్ రుచిని మరిపించేలా హలీం కేంద్రాలు వెలుస్తున్నాయి.



ఇలా తయారు చేస్తారు..

గోధుమ రవ్వ, నెయ్యి, మటన్ (బోన్‌లెస్), పుట్నాల పప్పు (తినే శెనగ పప్పు), గరం మసాలా, ఉల్లిపాయలు, కొత్తిమీర, పుదీనాతో తయారు చేస్తారు. లేత పొట్టేలు మాంసం అయితే రుచి బాగా ఉంటుంది. మాంసాన్ని పెద్ద మందపాటి పాత్రలో 5 గంటల పాటు ఉడికిస్తారు. గోధుమ రవ్వ, పుట్నాల పొడి, గరం మసాల వేసి బాగా కలిపి మరో 4 గంటల పాటు సన్నటి సెగపై (అడుగు అంటకుండా) ఉడికిస్తారు. బాగా మెత్తగా ఉడికిన తర్వాత ఈ మిశ్రమానికి నెయ్యి కలిపి మెత్తగా కలిసిపోయే వరకూ పొడవైన కర్రలతో రుబ్బుతారు.



ఇరాన్‌కు చెందిన హుస్సేన్ జాబిత్ 1947లో హైదరాబాద్‌లోని మదీనా సర్కిల్‌లో హోటల్ ప్రారంభించి హలీం విక్రయాలు ప్రారంభించాడు. తర్వాత కాలంలో 1956లో రంజాన్‌మాసం ప్రారంభమైన తొలిరోజు హలీం పేరుతో కొత్త వంటకాన్ని తయారు చేసి 25పైసలకు ఒక పాత్రలో ఇవ్వడంతో దీని ప్రస్థానం ప్రారంభమైంది. తొలిరోజుల్లో అంతగా ఆదరణ లభించకపోవడంతో బిర్యానీకి హలీం ఫ్రీ అని ప్రకటించారు. తర్వాత సంవత్సరం హలీం విశిష్టతను తెలియజేస్తు పోస్టుకార్డులతో ప్రచారం నిర్వహించారు. టెలిఫోన్ డైరెక్టరీ ఆధారంగా అందులో ఉన్న అడ్రస్‌లకు పోస్టుకార్డులు రాశారు. దీంతో కొంత మేర విక్రయాలు పెరిగాయి. 1956–1960 వరకు పోస్టుకార్డులు, పత్రిక ప్రకటనలు, పోస్టర్లు తదితర మార్గాల్లో హుస్సేన్ ప్రచారం నిర్వహించగా ఆయన ప్రయత్నం ఫలించింది. 1961 నుంచి హలీంకు డిమాండ్ పెరిగింది. అప్పటి నుంచి 1998 వరకు మదీనా హోటల్‌లో హలీం విక్రయాలు జరిగాయి. అదే సంవత్సరం హుస్సేన్ మరణించాడు.

కరీంనగర్‌లో 5 క్వింటాళ్ల హలీం

కరీంనగర్ నగరవ్యాప్తంగా 20 హలీం సెంటర్లు ఉన్నాయి. వాటిలో రోజూ 5 క్వింటాళ్ల హలీం తయారు చేస్తుండగా విక్రయాలతో రోజూ రూ.22 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు బిజినెస్ జరుగుతోంది. హలీం అమ్మకాలకు తోడు ఇతర ప్రత్యేక వంటకాల ద్వారా మరో రూ.5లక్షల వ్యాపారం జరుగుతోంది. హలీం తయారీకి 3 క్వింటాళ్ల మేక మాసం ఉపయోగిస్తుండగా హరీస్ తయారీ కోసం క్వింటాల్ కోడి మాంసం అవసరం అవుతుంది. రోజూ ఒక్కో హలీం సెంటర్‌లో 15 నుంచి 50కిలోల హలీం, 5 నుంచి 20 కిలోల వరకు హరీస్‌ను తయారు చేస్తారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్యంగా 20 హలీం సెంటర్లు ఉండాగా వాటిలో అధిక భాగం గోదావరిఖనిలో ఉన్నాయి. రోజూ రెండు క్వింటాళ్ల హరీస్ విక్రయాలు జరుగుతుండగా, 500 కిలోల హలీం అమ్మకాలు సాగుతాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో సిరిసిల్లలో రెండు, వేములవాడలో రెండు హలీం కేంద్రాలున్నాయి. నాలుగు కేంద్రాల్లో మొత్తం 60 కిలోల హరీస్, 20కిలోల హలీం అమ్మకాలు జరుగుతాయి. ఇక జగిత్యాల జిల్లా పరిధిలో మొత్తం 20 హలీం సెంటర్లు ఉండగా అత్యధికంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. ఈ సెంటర్లలో మొత్తం 10 క్వింటాళ్ల హరీస్ అమ్మకాలు జరుగుతాయి.

20 ఏళ్లుగా అమ్మకాలు..



గత 20 సంవత్సరాలుగా హహేక్ క్యాటరింగ్ సెంటర్ ద్వారా హలీం, హరీష్, బిర్యానీ, అరేబియన్ వంటకాలను కరీంనగర్ నగర వాసులకు రుచి చూపిస్తున్నాం. హలీం తయారీలో ఇరానీ పద్ధతులు పాటిస్తునే కరీంనగర్ నగరవాసుల ఆహార అలవాట్లకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, స్వచ్ఛమైన మసాలా దినుసులు ఉపయోగించి తయారు చేయడం ఆయన ప్రత్యేకత. – **బాబా పటేల్, కింగ్స్ హలీం సెంటర్, కరీంనగర్**

ప్రేమాభిమానాలు ముఖ్యం..



ఉపవాస దీక్షల వల్ల ఆకలి బాధ తెలిసి పేదవాడికి కూడా సాయం చేయాలనే ఉద్దేశం కలుగుతుంది. పండుగా రోజు మతాలతో సంబంధం లేకుండా స్నేహితులను ఇంటికి ఆహ్వానిస్తాం. హలీంతోపాటు తీపితో కూడిన పాయసం తినిపిస్తాం. అందరి మనసుల్ని తీపి చేస్తూ అందరూ ప్రేమాభిమానాలతో జీవించాలని కోరుకుంటాం. – **సయ్యద్ ఇర్ఫాన్, కార్ఖానగడ్డ, కరీంనగర్**

బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు



పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని జాతీయ రహదారి పక్కన పలుచోట్ల బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా కొందరు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎంపీ అర్వింద్‌కు వ్యతిరేకంగా పసుపు బోర్డు ఏర్పాటు అంశంపై నిజామాబాద్‌లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీనికి కౌంటర్‌గా ఎమ్మెల్సీ కవిత జిల్లా పర్యటన నేపథ్యంలో శనివారం ఉదయం పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నిజాం చక్కెర కర్మాగారం, ఎన్ఆర్ఐ సెల్, డబుల్ బెడ్ రూం ఇళ్ల హామీలపై ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. వీటిని గుర్తించిన పోలీసులు.. ఎమ్మెల్సీ కవిత పట్టణంలోకి రాక ముందే ఫ్లెక్సీలు తొలగించారు.

తెలంగాణ ప్రవాసీ సమావేశం



సమావేశంలో మహిళా మోర్చా నాయకులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గల్ఫ్ కార్మికుల కుటుంబ సభ్యులతో తెలంగాణ ప్రవాస్ సమావేశం నిర్వహించారు. బీజేపీ ఏపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి కామేశ్వరి, జగిత్యాల జిల్లా నాయకురాలు భోగ శ్రావణి హాజరయ్యారు. కామేశ్వరి మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల కుటుంబాల సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. గల్ఫ్ కార్మిక సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురతాని భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని భక్తుడికి గాయాలు

జగిత్యాలక్రైమ్: తాటిపల్లి గ్రామ శివారులో జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై శనివారం కాలినడనక వస్తున్న ఆంజనేయస్వామి దీక్షాపరుడు అవుసుల సాయికుమార్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ఉమ్మెడ గ్రామానికి చెందిన 12 మంది ఆంజనేయస్వామి దీక్షాపరులు కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి పాదయాత్రగా వస్తున్నారు. శనివారం ఉదయం 4 గంటలకు తాటిపల్లి గ్రామం చేరుకునే సరికి నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి వచ్చి సాయికుమార్‌ను ఢీకొట్టింది. దీంతో సాయికుమార్‌కు బలమైన గాయాలు తగిలాయి. వెంటనే ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య



బుచ్చయ్య(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): దూలూర్ గ్రామానికి చెందిన అందూర్తి బుచ్చయ్య(70) అనారోగ్య కారణాలతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు శనివారం తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుచ్చయ్య ఏడాదిగా నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయంకాలేదు. మనస్తాపానికి గురైన బుచ్చయ్య శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత వివరించారు.

మరుగుదొడ్లకు తాళం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో దేవాదాయ శాఖ కొత్త కార్యాలయం ప్రారంభించి ఏళ్లు గడుస్తోంది. అయినా, మహిళల కోసం అందులో నిర్మించిన మరుగుదొడ్లు నేటికీ వినియోగంలోకి రాలేదు. దీంతో మహిళా భక్తులు, ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత హన్మాన్ జయంతి సందర్భంగా విధులకు హాజరైన ఓ మహిళా పోలీస్ అధికారి.. మరుగుదొడ్ల తాళం తెరిపించారు. దానిని వినియోగంలోకి తీసుకొచ్చారు. అయితే, ఉత్సవాలు ముగిసిన వెంటనే అధికారులు మరుగుదొడ్లకు తాళం వేయించారు. ఫలితంగా మహిళా ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



కేతు(ఫైల్)

గొల్లపల్లి(ధర్మపురి): దట్నూర్ గ్రామంలో గతనెల 30న ఎడ్లబండిని ద్విచక్ర వాహనంతో ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కొల్లూరి కేతు(36) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేతు తన ద్విచక్ర వాహనంపై చిల్వకోడూర్ చౌరస్తా నుంచి భీంరాజ్‌పల్లి వైపు వెళ్తుండగా చేను పక్కన ఉన్న ఎడ్లబండిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కేతు గాయపడగా కరీంగనర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. శునకాలపై ఎంతోప్రేమ ఉన్న కేతు ఇటీవల వాటికి బారసాల నిర్వహించి బంధువులకు విందుభోజనం ఏర్పాటు చేశారు. మృతుడికి భార్య భాగ్యలక్ష్మి, ముగ్గరు సంతానం ఉన్నారు.

మెటల్ డికెక్టర్లతో భక్తులకు తప్పని ఇబ్బందులు



మెటల్ డిటెక్టర్‌తో ఇబ్బంది పడుతున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): ఆలయ భద్రత దృష్ట్యా కొండపై మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేశారు. అయితే, వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఇవి ఇబ్బందిగా మారాయి. ప్రధాన ఆలయ ద్వారం ఎదుట ఏర్పాటు చేసి, వాటిని పర్యవేక్షించడానికి సిబ్బందిని నియమించాల్సి ఉంది. అలా కాకుండా ఆలయం లోపల మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేయడంతో అసలే ఇరుకుగా ఉన్న స్థలం మరింత ఇరుకుగా మారింది. భక్తులు వాటిమధ్య నుంచి స్వామివారి దర్శనం కోసం తరలివెళ్లడం ఇబ్బందిగా మారింది.

పేకాటరాయుళ్ల పట్టివేత

జగిత్యాలక్రైమ్: తాటిపల్లి గ్రామంలో రూరల్ ఎస్సై అనిల్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించారు. వారిని పట్టుకుని రూ.21,430 నగదు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇథనాల్ ప్రాజెక్టుతో ప్రాణనష్టం

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: ఇథనాల్ ప్రాజెక్టు ఏర్పాటుతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తుందని నిరసన తెలిపేందుకు పురుగు మందు డబ్బాలతో రోడ్లపై బైఠాయించిన వారికి మద్దతు తెలిపితే గృహ నిర్బంధం చేస్తారా? అని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నల్గొండ, చెన్నూర్ ప్రాంతాల్లో చేపట్టిన ఇథనాల్ ప్రాజెక్టు పనులను అక్కడి రైతులు తిరస్కరించారని, అందుకే దానిని వెల్గటూర్ మండలం స్తంభంపల్లికి మార్చారని ధ్వజమెత్తారు. ప్రాజెక్టుతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, గోదావరి జలాలు కలుషితం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవే విషయాలు టీవీలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో పాసిగామ ప్రజలు ఇథనాల్ పరిశ్రమ పనులు అడ్డుకున్నారని తెలిపారు. ప్రజల అభిప్రాయాల మేరకు గ్రామసభల్లో తీర్మానించి ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని, ఇదేమీ పట్టించుకోకుండా ఆగమేఘాలపై పనులు ప్రారంభిస్తే ప్రజలు ఊరుకోరని ఆయన హెచ్చరించారు. మంత్రి చేసిన పని ప్రజలకు మేలు చేసేదే అయితే.. శుక్రవారం రాత్రి పోలీస్‌యాక్టు అమలులోకి తేవడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి నర్సింగరావు, ఎస్. దినేశ్, సింహరాజు ప్రసాద్, రమేశ్, వేముల రాజేశ్, సీపతి సత్యనారాయణ, చిలుముల లక్ష్మణ్, అశెట్టి శ్రీనివాస్, బొడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ తెలంగాణకే గర్వకారణం

- డీసీఎమ్మెస్ ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: జిల్లాలోని వెల్గటూర్ మండలం స్తంభంపల్లి శివారులో నిర్మించే ఇథనాల్ రైస్ బ్రాన్ ఆయిల్ పరిశ్రమ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇథనాల్ పరిశ్రమ రైతులకు లాభసాటిగా నిలుస్తుందన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించి, అవసరమైన ఎరువులను దీనిద్వారా అందజేస్తారని ఆయన తెలిపారు. పరిశ్రమ ఏర్పాటుతో నియోజకవర్గంలోని సుమారు 300 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. తెలంగాణకు గుండెకాయలాంటి ఎల్లంపల్లి ప్రాజెక్టులో చుక్కనీరు కూడా కలుషితం కాదని ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఏషియన్ లాయర్స్ క్రికెట్ పోటీలకు ఎంపిక

- తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక న్యాయవాది



శ్రీలంక లాయర్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడితో అన్వేష్‌రెడ్డి

జగిత్యాలజోన్: సౌత్ ఏషియన్ లాయర్స్ క్రికెట్ పోటీలకు కోరుట్ల మండలం జోగిన్‌పల్లికి చెందిన న్యాయవాది ఏలేటి అన్వేష్‌రెడ్డి ఎంపికయ్యారు. పోటీలకు హాజరయ్యేందుకు ఆయన ఈనెల 30న శ్రీలంక బయలుదేరి వెళ్లారు. జగిత్యాల బార్ అసోసియేషన్‌లో కొంతకాలం న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన అన్వేష్‌రెడ్డి..ప్రస్తుతం హైదరాబాద్ హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. అన్వేష్.. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. తెలంగాణ హైకోర్టు క్రికెట్ టీంలో 2017 నుంచి ఆడుతూ, ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు జట్టుకు వెస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. మూడేళ్లుగా సౌత్ ఇండియా లాయర్స్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్నారు. మార్చి 30 నుంచి ఈనెల 5వ తేదీ వరకు శ్రీలంకలో నిర్వహించే సౌత్ ఏసియన్ లాయర్స్ క్రికెట్ పోటీలకు బెంగుళూరు, ముంబయి, కలకత్తా, కొలంబో, ఢాకా, ఢిల్లీ, కరాచి, లాహోర్ న్యాయవాదుల జట్లు పాల్గొంటున్నాయి. అన్వేష్‌రెడ్డి బెంగళూర్ క్రికెట్ జట్టు తరపున ఆడుతారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఆయన ఒక్కరే ఈ పోటీలకు ఎంపిక కావడం విశేషం.

మృత్యువుతో పోరాడి.. ఓడి..

- పదిహేనేళ్లుగా.. జీవచ్ఛవంలా..
- అబుదాబిలో జరిగిన ప్రమాదంలో రాజయ్యకు గాయాలు
- ఇన్నాళ్లు కోమాలో ఉండి గత మార్చి 12న మృతి



కోమాలో రాజయ్య(ఫైల్)



బడే రాజయ్య (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): పొట్ట చేతబట్టుకుని దేశం కాని దేశం వెళ్లిన ఆ అభాగ్యుడిని విధి వెంటాడింది. అక్కడ ప్రమాదం రూపంలో మృత్యువు కబళించే ప్రయత్నం చేయగా తృటిలో తప్పించుకుని జీవచ్ఛవంలా మారాడు. 15 ఏళ్లుగా ఆస్పత్రిలోనే కోమాలో ఉండి మృత్యువుతో పోరాడుతూ మార్చి 12న మృతిచెందాడు. శనివారం మృతదేహం ఇంటికి చేరగా బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామస్తులు వివరాలు.. కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన బడే రాజయ్య (52) గ్రామంలో సరైన పని దొరక్క 2005లో రూ.లక్షన్నర అప్పు చేసి మొదటిసారి అబుదాబికి వెళ్లాడు. అక్కడ రెండేళ్లు పని చేసిన తర్వాత ఇంటికి వచ్చి మళ్లీ 2007లో వెళ్లాడు. అబుదాబిలోని మస్ అనే బల్దియా కంపెనీలో కార్మికుడిగా పనిచేసేవాడు. 2008లో అక్కడి క్యాంపస్‌లో పని చేస్తుండగా పెద్ద ఇనుపగేట్ పైన పడింది. దీంతో అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే అక్కడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పదిహేనేళ్లుగా కోమాలోనే..

తలకు తీవ్రగాయాలు కావడంతో రాజయ్య 2008లో కోమాలోకి వెళ్లాడు. అప్పటినుంచి వైద్యులు చికిత్స చేస్తున్నారు. నాటి నుంచి మాటా లేదు.. ముచ్చటా లేదు. కొన్నేళ్ల వరకు కదలలేని స్థితిలోనే ఉండిపోయాడు. కాగా కొద్ది రోజుల నుంచి ఎవరైనా పిలిస్తే కళ్లు కొద్దిగా తెరిచి చూసేవాడు కానీ మాట్లాడడని అక్కడ ఉన్నస్నేహితులు తెలిపారు. రాజయ్యకు చెల్లెలు లక్ష్మి ఉండగా, బంధువులు లక్ష్మణ్, శంకర్, ధర్మేందర్, అంజయ్య అంత్యక్రియలు నిర్వహించారు.

టెండర్ ప్రతిపాదన వద్దు



ధర్నా చేస్తున్న కార్మికులు

కోరుట్ల: మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ లేబర్ టెండర్ విధానం ప్రతిపాదనను రద్దు చేసి పాత పద్ధతిలోనే కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ ఎండీ ఆయాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. రాములు మాట్లాడుతూ, కాంట్రాక్ట్ కార్మికులకు టెండర్ జరిగిన తర్వాత వేతనాలు ఇవ్వాలనే పద్ధతిని కొందరు కౌన్సిలర్లు ప్రతిపాదించటం సరికాదన్నారు. రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన జీవో ద్వారానే కార్మికులకు ప్రతినెలా వేతనాలు, పీఎఫ్ చెల్లిస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ ఉస్మాన్, ఎన్నం రాధ, తెడ్డు సాయిలు, ఎర్ర రాజ్‌కుమార్, చిట్యాల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హన్మాన్ జయంతికి ఏర్పాట్లు

- కొనసాగుతున్న పనులు



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు హన్మాన్ చిన్నజయంతి వేడుకలు నిర్వహించనున్నారు. లక్షలాది మంది భక్తులు, దీక్షాస్వాములు తరలిరానుండడంతో అవసరమైన ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

కొనసాగుతున్న పనులు..

ఆలయ ఆవరణలో చలువపందిళ్లు నిర్మించారు. దేవాదాయ కార్యాలయం ఎదుట పనులు కొనసాగుతున్నాయి. భక్తులు ఆలయం లోకి వెళ్లేందుకు వీలుగా ఆలయం సమీప షెడ్డుతోపాటు అదనపు క్యూలైన్లు సిద్ధం చేస్తున్నారు. లడ్డూ ప్రసాదం తయారీ వేగవంతమైంది. ఆదివారం నుంచి వై జంక్షన్ సమీపంలో ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేస్తారు. బొజ్జ పోతన్న సమీపంలో పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. నిత్యాన్నదాన సత్రాన్నిసాగర్ గెస్ట్ హౌస్‌లో కొనసాగిస్తున్నారు. కల్యాణ కట్ట, చలివేంద్రాలు, వైద్య శిబిరం ఏర్పాటు తదితర పనులు చురుకుగా సాగుతున్నాయి. కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు పనుల్లో వేగం పెంచారు.